వ్యాధుల కాలం జాగ్రత్త

- పరిసరాల పరిశుభ్రతే రక్ష
- వర్షాకాలం–పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు
- అప్రమత్తంగా ఉండాలని సూచన



సిరిపూర్‌లో నిల్వనీటిని తొలగిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



మల్లాపూర్‌లో రోడ్లపైనే నిలిచిన నీరు

మల్లాపూర్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కావున ప్రజల ఆరోగ్యం దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తునఆనరు. వర్షాకాలం వాతావరణంలో వచ్చే మార్పులు, ఇంటి పరిసరాల్లో నిలిచే నీరు, డ్రైయినేజీలతో ప్రజలు రోగాల బారిన పడే ఆస్కారం ఉంది. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, డయోరియా, ఫైలేరియా, స్వైన్‌ఫ్లూ వంటి సీజనల్ వాధ్యులు ప్రతి ఏటా ప్రజలను భయపెడుతూనే ఉన్నాయి. వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రతను పాటిస్తే వ్యాధులను దూరం చేసుకోవచ్చునని వైద్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతే ముఖ్యం..

పట్టణాలలో, పల్లెల్లోని ఇళ్లలో నివసించేవారు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంట్లో వాడే కూలర్లు, కొబ్బరిబోండాలు, డబ్బాల్లో నీరు నిల్వ లేకుండా ఉండకుండా చూసుకోవాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. ఎక్కడ పడితే అక్కడ చెత్తా వేయడం, మల, మూత్ర విసర్జన చేయకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఆరోగ్య విషయాల్లో మరింత శ్రద్ధ తీసుకోవాలి. కాచి వడబోసిన నీటినే తాగాలి.

అవగాహన తప్పనిసరి..

విద్యార్థులకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధులు, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి. చేతులను శుభ్రం చేసుకునే పద్ధతులను వివరించాలి. గ్రామీణ ప్రాంతంలో ఆపరిశుభ్రం లేకుండా ప్రజల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలి. సీజనల్ వ్యాధులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉంటే వ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చు.

వర్షాకాలంలో ప్రబలే వ్యాధులు...

వర్షాకాలంలో వాంతులు, విరోచనాలు, టైఫాయిడ్, మలేరియా, చికెన్‌గున్యా, డెంగీ తదితర వ్యాధులు సులభంగా వ్యాపించే ప్రమాదం ఉంది. ఏ మాత్రం అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే ఆస్పత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వీడాలి...

గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణపై జీపీ అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కాని కొన్ని గ్రామాల్లో వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ పారిశుధ్యంపై ఇప్పటివరకు ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గ్రామాల్లో మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తోందని, ఇలా రోడ్లపై మురుగు నీరు పారుతుండడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు వ్యాధులకు గురై రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. మున్సిపల్, మండల, గ్రామస్థాయిలో అధికారులను అప్రమత్తం చేశాం. పట్టణాల్లో శివారు ప్రాంతాలు, గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. సీజనల్ వ్యాధులపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం.

– శ్రీధర్, జిల్లా వైద్యాధికారి

ఒకటేవాన

జగిత్యాల: సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న ఏకధాటి వర్షంతో జిల్లా కేంద్రంలోని 43, 34, 14 వార్డుల్లో గల గంజ్‌నాలాకు వరద పోటెత్తింది. పారిశుధ్య అధికారులు రంగంలోకి దిగి వరద వెళ్లేందుకు వీలుగా యుద్ధ ప్రాతిపదిక చర్యలు తీసుకున్నా.. ఇళ్ల మధ్యలో ఉండటంతో అది సాధ్యం కావడం లేదు. జగిత్యాల – గోవిందుపల్లి మధ్య మోతెవాగుపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. రాకపోకలు స్తంభించిపోయాయి. నర్సింగాపూర్ మార్గంలో డ్రైనేజీలు లేక వరద నిలిచి చెరవులను తలపిస్తోంది. అక్కడ ఇప్పుడిప్పుడే అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, శిథిలమైన భవనాల్లో నివాసం ఉంటున్నవారిని తరలించేందుకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అత్యవసర సేవల కోసం నిరంతరం పనిచేసే 95503 33241 నంబరు అందుబాటులోకి తెచ్చారు.

భయం గుప్పిట్లో ప్రజలు..

- చెరువులు, కుంటల్లోకి భారీగా వరద చేరడంతో ఎప్పుడు తెగిపోయి ముంపునకు గురవుతామోనని ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లోని శిథిల భవనాలు, ఇళ్లు కూల్చివేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు.
- శిథిల భవనాల్లోంచి ఖాళీచేసేందుకు కొందరు ససేమిరా అంటున్నారని తెలిసింది. దీంతో వారికి నోటీసులు జారీచేస్తున్నారు.
- జగిత్యాలలోని జాంబాగ్, తులసీనగర్, బుడిగజంగాల కాలనీ, నాగేంద్రనగర్, మోతెరోడ్డు తదితర లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను వరద భయం వెంటాడుతోంది.



జగిత్యాల పట్టణంలో శిథిలావస్థకు చేరిన ఇల్లు

జగిత్యాలరూరల్: జగిత్యాల మండలంలోని చెరువు కుంటలు పూర్తిస్థాయిలో నిండిపోయాయి. హన్మాజీపేట శివారులోని బొల్లెవాగు ఉధృతంగా ప్రవహించింది. రాయికల్ మండలంలోని మూటపల్లి వాగు ఉధృతంగా ప్రవహించింది. మైతాపూర్ కల్వర్టుపై భారీగా వరద నీరు రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

పంచాయతీ కార్మికుల వినూత్న నిరసన



ఇబ్రహీంపట్నంలో దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

సారంగాపూర్:తమ సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కొనసాగుతున్నాయి. మంగళవారం సారంగాపూర్‌లో రోడ్డుపై వంటావార్పు నిర్వహించి అక్కడే భోజనాలు ముగించారు. బీర్‌పూర్‌లో ఒంటికాలుపై నిలబడి నిరసన తెలిపారు. నిరసనలో జీపీ కార్మికులు పాల్గొన్నారు.

దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి..

ఇబ్రహీంపట్నం: పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా మంగళవారం దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి నిరాసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది సంఘం మండల ఉపాధ్యక్షుడు అనంతకుమార్, ప్రధాన కార్యదర్శి జిల్లాపెల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మల్యాలలో బతుకమ్మ ఆడి..

మల్యాల: తమ హక్కుల సాధన కోసం చేపట్టిన దీక్షలో భాగంగా మంగళవారం మల్యాలలో పంచాయతీ కార్మికుల బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు.తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సీఎం చిత్రపటాలకు వీఆర్‌ఏల క్షీరాభిషేకం



కథలాపూర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

కోరుట్ల రూరల్: ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యులర్ చేసి, శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తూ జీవో జారీ చేయడంపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏలు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్ర పటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు గొడిసెల గంగాధర్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మండల అధ్యక్షుడు వీరయ్య, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి వీఆర్‌ఏలు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల జేఏసీ జగిత్యాల జిల్లా కొకన్వీనర్ బెజ్జరపు సతీష్‌కుమార్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

కథలాపూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద, బీమారం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యే రమేశ్‌బాబు చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. సీఎం కేసీఆర్‌ను వీఆర్‌ఏలు ఎన్నడు మరిచిపోమంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండలాధ్యక్షుడు రొడ్డ పోచయ్య, ప్రతినిధులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: రాయికల్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏళ్లుగా వీఆర్‌ఏలుగా పనిచేస్తున్న వారిని సీఎం కేసీఆర్ గుర్తించి పేస్కేలు ప్రకటించడం అభినందనీయమన్నారు. సీఎంకు వీఆర్‌ఏలు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు నక్క శంకర్, కార్యదర్శి నవీన్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

సారంగాపూర్: వీఆర్‌ఏలకు ఇతర శాఖల్లో పోస్టింగ్‌లు కల్పించడంతో పాటు , పేస్కేలు అమలు చేయడంపై ముఖ్యమంత్రి చిత్రపటానికి మండల వీఆర్‌ఏలు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

వెల్గటూర్: వీఆర్‌ఏల ఉద్యోగాలను క్రమబద్ధీకరించి, పేస్కేలు అమలు చేయడంతో మంగళవారం వీఆర్‌ఏలు వెల్గటూర్లో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు,ఎమ్మెల్సీ కవిత, మంత్రి కొప్పుల ఈశ్వర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు నారాయణ, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

మరమ్మతులు చేస్తేనే చెరువుల్లో నీళ్లుండేది?



తాండ్ర్యాల ఊరచెరువు నుంచి వృథాగా పోతున్న నీళ్లు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఊర చెరువులో నీరు పుష్కలంగా చేరింది. చెరువు మత్తడి వద్ద రాళ్లు కొట్టుకుపోవడంతో నీళ్లన్నీ వృథాగా పోతున్నాయి. చెరువులో నీళ్లు చేరిన నిల్వ ఉండటం కష్టమని స్థానికులు తెలిపారు. మరోవైపు మండలంలో ఊట్‌పెల్లిలో చెరువులకు నీళ్లు వచ్చే ఒర్రె తెగిపోవడంతో అందులోకి నీళ్లు రావడంలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఊట్‌పెల్లి చెరువులోకి వచ్చే నీరంతా వృథాగా వెళ్లిపోతుందన్నారు. నీటిపారుదలశాఖ అధికారులు చొరవ చూపి తాండ్ర్యాల చెరువు మత్తడిని, ఊట్‌పెల్లిలో ఒర్రెను త్వరగా మరమ్మతులు చేయిస్తేనే ప్రయోజనం చేకూరుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

‘మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలి’



ధర్మపురిలో నిరసన తెలుపుతున్న నాయకులు

కోరుట్ల: మణిపూర్ ఘటనలో నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు సుతారి రాములు, సీపీఎం నాయకులు గుమ్మడి రమేశ్, ఎల్ల పోశన్న, శంకర్, నాగరాజు, రజియా, పద్మ,తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: మణిపూర్‌లో మహిళలపై జరిగిన దాడి సంఘటనకు బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ధర్మపురి పట్టణంలో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ నాయకురాలు లక్ష్మి, కార్మికులు కలమడుగు గంగన్న, ముప్పట్ల లక్ష్మి, బడుగు రాజమణి, బత్తిని రాజవ్వ తదితరులున్నారు.

ఓటరు నమోదుపై బీఎల్‌వోలకు శిక్షణ



బీఎల్‌వోలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

సారంగాపూర్: ఓటరు నమోదు, ఇతర అంశాలపై యాప్‌లో నమోదు చేయడంపై మంగళవారం గ్రామాల బూత్‌లెవల్ అధికారులకు సారంగాపూర్ తహసీల్దార్ శిక్షణ ఇచ్చారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు వచ్చేలా చూడాలని ఇందుకు యాప్‌లో ఓటరు నమోదు, సంబంధిత ధృవీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయడం అంశంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ రావు, ఆర్ఐ భాస్కర్‌రావు, కృష్ణ, రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

బుగ్గారం: ఓటరు నమోదు, సవరణలపై బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎంఏ ఫరూక్ అన్నారు. బుగ్గారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు మాస్టర్ ట్రైనర్స్ ద్వారా ఫొటో ఎలక్టోరల్ రోల్స్‌పై శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒకరిని ఓటరుగా నమోదు చేయించాలన్నారు. పలు అంశాలపై మాస్టర్ ట్రినర్స్ శివప్రసాద్, రాజయ్య శిక్షణిచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లిలో మండల గంగయ్య ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మంగళవారం పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీలు ఎండబెట్ల గాబ్రియల్, బేతి పూర్ణ చందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అప్పం స్వామి తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి సత్యం పరామర్శ



పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్యాల: మండల కేంద్రానికి చెందిన కొక్కుల వేణుగోపాల్, నూకపల్లి లో దొంతరవేని ధర్మయ్య ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాలను మంగళవారం కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యంపరామర్శించారు. ఆయన వెంట ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు శనిగరపు తిరుపతి, మల్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కటుకం వినయ్, ఎండీ.ఇమామ్, మురళీ ఉన్నారు.

చెత్త తొలగించారు..



చెత్త తొలగిస్తున్న కార్మికులు

వెల్గటూర్: పంచాయతీ కార్మికుల సమ్మెతో పారిశుద్ధ్యం పేరుకుపోవడంతో ‘గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త’ పేరున మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెల్గటూర్‌లోని వ్యాపార సముదాయాల ముందు పేరుకుపోయిన చెత్తను పంచాయతీ కార్యదర్శి హఫీజ్ దగ్గరుండి శుభ్రం చేయించారు.

సాక్షి స్పందన

సంక్షిప్త వార్తలు

ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలి

ధర్మపురి: నిలిచిపోయిన ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తపస్ నాయకులు కాశెట్టి శ్రీనివాస్, ప్రవీణ్ సంతోష్, రవీందర్, శీలం రాజేశ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

వెల్గటూర్: పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్‌ను వెల్గటూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో సంజీవరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ వెల్గటూర్ మండల అధ్యక్షుడు జోగం శ్రీనివాస్ మాట్లాడుతూ బుధవారం జగిత్యాలలో జరిగే బైక్ ర్యాలీతో పాటు దేవిశ్రీ గార్డెన్స్‌లో జరిగే సమావేశానికి, ఆగస్టు 12న హైదరాబాద్‌లో జరిగే సమావేశానికి మండలంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్వరి, కార్యదర్శులు గంగాధర్, హఫీజ్ ఆఫీస్ సబార్డినేట్ లచ్చయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడిపై సీఐకి ఫిర్యాదు

కోరుట్ల: కాంగ్రెస్ నాయకుడు అక్బర్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్ మైనారిటీ నాయకులు మంగళవారం సీఐ ప్రవీణ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అక్బర్ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావుపై సోషల్ మీడియాలో అనుచిత వాఖ్యలు చేశాడని, ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మైనారిటీ యూత్ అధ్యక్షుడు ఎండీ.అతిక్, ప్రధాన కార్యదర్శి అర్బాజ్, ఉపాధ్యక్షుడు ఎండీ అమీర్, కార్యదర్శి అజ్మత్ పాల్గొన్నారు.

జీపీ సిబ్బందికి రెయిన్ కోట్స్ పంపిణీ

పెగడపల్లి: మండలంలోని ఆరవెల్లి గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందికి సర్పంచి ఉప్పులంచె లక్ష్మణ్ మంగళవారం రెయిన్ కోట్స్ పంపిణీ చేశారు. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కరుస్తున్న వర్షాల్లోనే పంచాయతీ సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతుండడంతో పంచాయతీ నిధుల నుంచి రెయిన్‌కోట్లు కొనుగోలు చేసి పంపిణీ చేశారు. ఎంపీటీసీ గంగారెడ్డి, ఉప సర్పంచ్ బాబురావు, పంచాయత కార్యదర్శి కిరణ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న తపస్ నాయకులు

కథలాపూర్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మేడిపెల్లి తహసీల్దార్‌కు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏళ్ల తరబడి జాప్యం చేయొద్దని కోరారు. అంతకుముందు మండలంలోని వల్లంపెల్లి, కల్వకోట, మన్నెగూడెం, దమ్మన్నపేట గ్రామాల్లో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ప్రసాద్‌రావు, మండల నాయకులు మల్లేశ్‌రావు, మహిపాల్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, లక్ష్మీనారాయణ, రాజేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు



సభ్యత్వం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

కథలాపూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో మంగళవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. మండలంలోని సిరికొండ, కథలాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో తిరిగి ఉపాధ్యాయుల సభ్యత్వాలు నమోదు చేయించుకున్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు అడ్డగట్ల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి నడిగడ్డ రాజు, నాయకులు కోగిల కృష్ణ, సిరిపురం వెంకటేశ్, పాటిల్ దరందీప్, చింత సురేశ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఆర్యవైశ్య నాయకులు

వెల్గటూర్: ఆర్యవైశ్య సామాజికవర్గం పేదల కోసం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మండల ఆర్యవైశ్యులు మంగళవారం తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ ల మాదిరిగానే ఆర్యవైశ్య సామాజికవర్గంలో కూడా చాలామంది నిరుపేదలు ఉన్నారని, అలాంటి వారి కోసం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రేగొండ రామన్న, వెల్గటూర్ పట్టణ అధ్యక్షుడు పెద్ది శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు సిరంగి లక్ష్మణ్ కుమార్, వెల్గటూర్ పీఏసీఎస్ అధ్యక్షుడు గోలి రత్నాకర్, పేద ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సముద్రాల రమేశ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సారంగాపూర్: ఈ నెల 27న జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగే విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశానికి మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. మంగళవారం అర్పపల్లిలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆగస్టులో హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప సభకు ముందుగా జగిత్యాలలో ఏర్పాటు చేస్తున్న సన్నాహక సభకు మాదిగలు, మాదిగ ఉపకులాలను తరలించడంపై చేపట్టాల్సిన చర్యలపై మంద కృష్ణ మాదిగ జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్‌లో సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయలు మీసాల లింగన్న, బదినేపల్లి గంగారాం, పోషయ్య, అనిల్, పృథ్వీ, సురేందర్, ఉమేశ్ పాల్గొన్నారు.

సమాచారం..

28న ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

కథలాపూర్: మేడిపెల్లిలోని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణమాచార్యులు మంగళవారం తెలిపారు. మేడిపెల్లిలో బాలురకు బైపీసీ కోర్సులో మాత్రమే సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 28న ఉదయం 10 గంటలకు మేడిపెల్లిలోని కళాశాలలో సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

30న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్ పోటీలు

మెట్‌పల్లి: వచ్చే 7న హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొనే క్రీడాకారుల ఎంపిక కోసం ఈ నెల 30న పట్టణంలోని మినీ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి మంగళవారం తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలకు నేరుగా హాజరు కావాలని ముత్తయ్యరెడ్డి పేర్కొన్నారు.

ఆదర్శ పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి ఆదర్శ పాఠశాలలో 10వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ నాగసుధారాణి తెలిపారు. 10వ తరగతిలో 8 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ప్రోగ్రెస్‌కార్డు, వ్యక్తిగత అర్హత పత్రాలతో ఈనెల 28న సాయంత్రం 3 గంటలలోపు పాఠశాల ప్రిన్సిపాల్‌కు సమర్పించాలని, ఈనెల 30న ఉదయం 10.30 గంటలకు రాతపరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

జగిత్యాలరూరల్: రాయికల్ మండలంలోని ఇటిక్యాల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 6–10వ తరగతి విద్యార్థులకు మంగళవారం నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వం మన ఊరు మన బడి, మన బస్తి మనబడిలో రాష్ట్రంలో మొదటిసారి 9,10వ తరగతి విద్యార్థులకు ప్రతి విద్యార్థికి ఒక సబ్జెక్ట్‌కు రెండు నోట్‌బుక్‌ల చొప్పున 14 నోట్‌బుక్స్ అందజేస్తోంది. కార్యక్రమంలో హెచ్‌ఎం ముక్కెర శేఖర్, ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వరశర్మ, ఎద్దండి రమేశ్, శాంతకుమారి, సంపత్‌కుమార్, నిక్కత్ సుల్తానా, మధు, నాగరాజు పాల్గొన్నారు.